# అప్పు

-ఎం.గాంధీ

"రాజారావుగారు ఉన్నారాండీ?" అడి గాడు చలపతి మొహానికి పట్టిన చెమట తుడుచు కుంటూ.

"లేరండీ- ఏదో పని వుందని పొద్దున్నే పట్నం వెళ్ళారు" అంది రాజారావు ధర్మపత్ని శారదాంబ.

చలపతి కాసేపు ఆలోచించి వెనుదిరిగి పోతూ "ఎప్పుడొస్తానన్నాడండీ" అని అడి గాడు.

"ఏమో తెలీదండి" ముక్తసరిగా సమాధానం చెప్పింది ఆమె.

అక్కడ్నుంటి చలపతి వెళ్ళిపోగానే శార దాంబ తలుపు మూసేసి బెడ్‌రూంలో మంచం కింద దాక్కొని వున్న రాజారావు దగ్గరకు వచ్చింది.

"వెళ్ళిపోయాడా?" అని అడిగాడు అదోలా వంకరనవ్వు నవ్వుతూ రాజారావ్.

"ఆ...బయట మీరు వదిలిన చెప్పులు చూసి మీరు ఇంట్లోనే ఉన్నట్టు పసిగట్టేస్తారనుకున్నా" అంది శారదాంబ.

"వాడికి ఆమాత్రం కుశాగ్రబుద్ధి వుంటే నాకు అప్పు ఇచ్చేవాడు కాదు" అన్నాడు రాజారావు మంచంమీద పడుకుంటూ.

"ఇలా ఎన్నిసార్లు తిరుగుతాడో?" అంది శారదాంబ.

"ఈపాటికే బాగా విసిగిపోయి ఉంటాడు. మహా అయితే ఇంకో మూడు నాలుగుసార్లు తిరుగుతాడు. ఇలాగే నేను లేనని చెప్పిస్తే, నేని వ్వాల్సిన అప్పుమీద ఆశలు వదులుకుంటాడు" అన్నాడు రాజారావ్ సైకాలజీ తెల్సిన ప్రొఫెసర్లా.

అబద్ధాలు చెప్పి, బాధలు వున్నట్టు నటించి ఓ సందర్భంలో చలపతి దగ్గర్నుండి ఓ పదివేలు అప్పు తీసుకున్నాడు రాజారావ్.

వారం రోజుల్లో తిరిగి ఇస్తానన్న రాజారావ్ ఇప్పటికి రెండేళ్ళు అవుతున్నా చలపతి అప్పు తీర్చలేదు. ఫోన్ చేస్తే ఆన్సర్ చేయడు. వేరేవాళ్ళ ఫోన్ నుండి చేస్తే ఎక్కడో ఉన్నట్టు అబద్ధం చెప్పి ఇంటికి రాగానే ఇచ్చేస్తానని చెబుతాడు.

ఇంటికొస్తే వుండికూడా ఇంట్లోలేనట్టు భార్య చేత అబద్ధం చెప్పిస్తున్నాడు.

నిజంగా రాజరావ్ ప్రాబ్లమ్స్‌లో వుండుంటే చలపతి తన డబ్బు తిరిగివ్వమని అడిగేవాడు కాదు. కానీ, వాడి దగ్గర డబ్బు వుండి కూడా ఇవ్వడం లేదని తెల్సి ఎలాగైనా రాజారామ్ దగ్గ ర్నుండి వసూలు చేయాలని డిసైడ్ చేసుకు న్నాడు చలపతి.

***

మరుసటి రోజు చలపతి ట్రిమ్‌గా తయారై రాజారావ్ ఇంటికి వెళ్ళాడు.

"లేరండీ" అని రాజారావ్ ఏదో ఊరు వెళ్ళి నట్టు చెప్పింది శారదాంబ.

"తాగడానికి కాస్త నీళ్ళు ఇస్తారాండీ?" అని అడిగాడు చలపతి.




మంచినీళ్లు తీసుకుని రావడానికి లోపలికె ళ్ళింది శారదాంబ.

ఈలోగా ఇంటిలోపలికొచ్చి హాల్లో నిలబ డ్డాడు చలపతి.

ఇంతలో నీళ్ళు తీసుకుని వచ్చిన శారదాం బతో "చాలాదూరం నుండి నడుచుకుంటూ వచ్చాను. కాసేపు కూర్చొని వెళ్తాను" అని హాల్లో ఉన్న సోఫాలో కూర్చున్నాడు చలపతి.

శారదాంబ అడ్డు చెప్పలేకపోయింది. తర్వాత కిచెన్‌లో ఏదో పని చూసుకుని వచ్చేసరికి సోఫాలో పడుకుని ఆదమరచి నిద్రపోతున్నాడు చలపతి.

ఇంతలో చిట్టీ వేసే కస్తమర్లు, పక్కింటి వాళ్ళు వచ్చి వెళ్ళారు.

చలపతిని నిద్రలేపలేక, వీధి తలుపు వేసుకో లేక చాలా అవస్థపడింది శారదాంబ.

ఊరెళ్ళిన రాజారావు నాలుగో రోజు తిరిగొ చ్చాడు.

"ఏవండీ ఆ చలపతికివ్వాల్సిన పదివేలు వెంటనే ఇచ్చేయండి" అంది రాజారావుకు కాఫీ అందిస్తూ శారదాంబ.

"ఏం...ఎందుకు. ఇంటికి వచ్చి ఏమైనా గొడవ చేశాడా?"

"లేదు- రోజూ ఇంటికొచ్చి వెళుతున్నాడు. నాకు చాలా ఇబ్బందిగా వుంది. మీ డబ్బు యావ మండినట్టే వుందిగానీ ముందు వాడి బాకీ తీర్చేయండి. లేకపోతే బావుండదు" అంటూ సీరియస్‌గా చెప్పింది.

ఆరోజే చలపతి ఇంటికి వెళ్ళి అతని బాకీ డబ్బు మొత్తం పువ్వుల్లో పెట్టి ఇచ్చేశాడు రాజా రావు.

★